సాక్షి
కర్నూలు
ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



225 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శనివారం 225 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 221 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



సంగమేశ్వరంలో కార్తీక పూజలు

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయంలోని వేపధారు శివలింగానికి కార్తీక శనివారం సందర్భంగా పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.



శ్రీగిరి కిటకిట

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు శ్రీగిరికి తరలి వచ్చారు. వేకువ జామునే పాతాళ గంగలో స్నానాలాచరించారు. 8లో▸

న్యూస్‌రీల్

జైలును పరిశీలించిన జిల్లా జడ్జి



భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

కర్నూలు (లీగల్): నగర సమీపంలోని జిల్లా జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. ఖైదీలకు అందుతున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన ఖైదీలతో మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని కారణంగా ఎవరైనా న్యాయం పొందలేకపోతే లోక్ అదాలత్ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎస్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రేపు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా ఈ సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

దేవదాయ శాఖ జేవీఓగా వాణి

- ఉరుకుంద ఈరన్న దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా రామాంజనేయులు



వాణి



రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: దేవదాయ శాఖ కర్నూలు డివిజన్ జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేవీఓ)గా సహాయ కమిషనర్ కె.వాణి నియమితులయ్యారు. జేవీఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరెడ్డి మరణించడంతో ఆ స్థానంలో కౌతాళం మండలం ఉరుకుంద శ్రీ నరసింహ(ఈరన్న) స్వామి దేవస్థానం ఈఓగా విధులు నిర్వహిస్తున్న వాణిని నియమించారు. దేవదాయ శాఖ కర్నూలు సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.రామాంజనేయులుకు ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఈఓగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఇరువురూ సోమవారం నూతన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

దేవనకొండలో ప్రబలిన అతిసారం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రజలు

దేవనకొండ: స్థానిక పాత మార్కెట్‌యార్డు సమీపంలో నివసిస్తున్న పలువురు శనివారం వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. దాదాపు 8 మంది స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రంలో చేరారు. వైద్యులు చికిత్స చేసి అతిసార వ్యాధిగా గుర్తించారు. మండల కేంద్రంలోని తాగునీటి ట్యాంక్‌లకు గాజులదిన్నె ప్రాజెక్ట్ నీళ్ల సరఫరా అవుతున్నాయి. ఇక్కడ అధికారులు ట్యాంక్‌లను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతోనే తరచూ ప్రజలు అతిసార వ్యాధి బారిన పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కోసారి మురుగునీటిని తలపిస్తున్నాయని, ఇదే విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

కడుపు కోతలకు చెక్!

- ప్రభుత్వ చర్యలతో తగ్గుతున్న సిజేరియన్లు
- గత ఏడాది 27,870 ఆపరేషన్లు
- ఈ ఏడాది ఇప్పటివరకు 10,040 మాత్రమే..
- సాధారణ ప్రసవాలే మేలంటున్న వైద్యులు

మాతృత్వం మహిళలకు వరం. వివాహమైన మహిళ.. తల్లి అయ్యేందుకు పరితపిస్తుంది. గర్భం దాల్చిన వెంటనే బిడ్డ ఎప్పుడెప్పుడు బయటకు వస్తాడా అని ఎదురుచూస్తూ కాలం గడుపుతుంది. అయితే నెలలు నిండిన తర్వాత సాధారణంగా జరగాల్సిన ప్రసవానికి కత్తెర పడుతోంది. కొందరు వైద్యులు పలు అనారోగ్య కారణాలు చెప్పి సిజేరియన్ కాన్పులు చేసేస్తున్నారు. ఈ తంతు ప్రభుత్వ ఆసుపత్రుల కన్నా ప్రైవేటులోనే అధికంగా జరుగుతోంది. దీనిని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ మొదలుపెట్టింది. ఎక్కువ సిజేరియన్లు జరిగిన ఆసుపత్రిపై ఆడిట్ నిర్వహించి చర్యలు తీసుకుంటోంది.

– కర్నూలు(హాస్పిటల్)

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోని మాతాశిశు కేంద్రం, ఏరియా ఆసుపత్రి, ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రితో పాటు ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ఎక్కువగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ఆదోని ఎంసీహెచ్, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, ఓర్వకల్లు ఆస్పత్రుల్లో కాన్పులు జరుగుతున్నాయి. ఇందులో సిజేరియన్ కాన్పులంటే అధికంగా కర్నూలు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతున్నాయి. ఇక్కడ ఒకప్పుడు సగానికి సగం సిజేరియన్ కాన్పులు జరిగేవి. ప్రస్తుతం 30 నుంచి 40 శాతలో సిజేరియన్ కాన్పులు చేస్తున్నారు. వీటితో పాటు 60కి పైగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ప్రసవాలు చేస్తుండగా అందులో 70 శాతం వరకు సిజేరియన్ కాన్పులే చేస్తున్నారు.

కోతలకు చెక్ పెట్టేందుకు చర్యలు

అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసరంగా సిజేరియన్ కాన్పులు చేయకుండా చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఏ ఆస్పత్రిలోనైనా అధిక శాతం సిజేరియన్ కాన్పులు జరిగితే ఆడిట్ చేయిస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆయా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి సదరు మహిళకు సిజేరియన్ ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరాలు తెలుసుకుంటుంది. అనవసరంగా సిజేరియన్ చేశారని తెలిస్తే సదరు ఆసుపత్రిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రైవేటు ఆసుపత్రులకు అధికారులు నోటీసులు జారీ చేశారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో దోపిడీ

సాధారణంగా జరగాల్సిన ప్రసవాలను సైతం కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో సిజేరియన్‌గా మారుస్తున్నారనే ఆరోపణలున్నాయి. సాధారణ కాన్పు కంటే సిజేరియన్ చేస్తే ఎక్కువగా డబ్బులొస్తాయనే ఆశతో ఈ చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల్లోనూ సిజేరియన్ కాన్పులే ఎక్కువగా కనిపిస్తుండటం గమనార్హం. సాధారణ కాన్పు కంటే సిజేరియన్‌కే ఎక్కువ ప్యాకేజీ ఉండటంతో వారు కూడా అటువైపే మొగ్గుచూపుతున్నారు. నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు ఇలాంటి చర్యలకు ఉపక్రమిస్తున్నాయని తెలిసినా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొందరు జాతకాల పిచ్చితో ఫలానా సమయంలోనే బిడ్డ బయటకు రావాలని చెప్పడంతో సిజేరియన్ చేసి ఆ సమయంలోనే బిడ్డను బయటకు తీసి చేతిలో పెడుతూ క్యాష్ చేసుకుంటున్నారు. ఆసుపత్రుల స్థాయిని బట్టి ప్రైవేటులో సిజేరియన్‌కు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నారు.



సాధారణ, సిజేరియన్ ప్రసవాలకు తేడా...

- సాధారణ ప్రసవం అయితే ఆ మహిళ వెంటనే కోలుకుంటుంది. కాన్పు జరిగిన రెండోరోజు నుంచే పనులు చేసుకుంటుంది.
- పుట్టిన బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుంది.
- శస్త్రచికిత్స(సిజేరియన్) ద్వారా బిడ్డను బయటకు తీస్తే రెండు వారాల పాటు ఆ మహిళకు పూర్తి విశ్రాంతి అవసరం అవుతుంది. దీనికితోడు ప్రతి పనికీ ఆమె ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఏర్పడుతుంది.
- మరో బిడ్డకు జన్మనిచ్చేందుకు సైతం చాలా సమయం కావాల్సి వస్తోంది. వెంటనే మరో బిడ్డకు జన్మనివ్వాల్సి వస్తే ఆరోగ్యం దెబ్బతింటుంది.

రెండేళ్లలో జరిగిన సాధారణ, సిజేరియన్ కాన్పులు

	2022-2023			2023-2024		
ఆసుపత్రులు	సాధారణ	సిజేరియన్	మొత్తం	సాధారణ	సిజేరియన్	మొత్తం
పీహెచ్‌సీలు	7,094	0	7,094	4,473	0	4,473
సీహెచ్‌సీలు	4,757	1,831	6,588	4,136	1,180	5,316
ఎస్‌డీహెచ్‌లు	2,782	513	3,295	2,115	397	2,512
జీజీహెచ్	4,777	4,678	9,455	5,315	2,608	7,923
ప్రైవేటు	15,170	19,848	35,018	12,883	5,855	18,738
మొత్తం	34,580	26,870	61,450	28,922	10,040	38,962

సిజేరియన్ కేసులు అధికమైతే ఆడిట్



ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కడైనా సిజేరియన్ కాన్పులు అధికమైతే అక్కడ ఆడిట్ చేస్తాం. ఉదాహరణకు వంద కేసులు కాన్పులు చేశారంటే అందులో అన్నీ సిజేరియన్ జరిగితే సదరు ఆసుపత్రిని వెంటనే తనిఖీ చేసి ఆడిట్ నిర్వహిస్తాం. ఎక్కువగా సిజేరియన్ ఎందుకు చేయాల్సి వచ్చిందో వివరణ కోరతాం. అనవసరంగా సిజేరియన్ చేశారని తెలిస్తే ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తాం. ఇలా చేసిన నగరంలోని కొన్ని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశాం.

– డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్ఓ, కర్నూలు

అత్యవసరమైతేనే సిజేరియన్



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతిరోజూ 30 దాకా ప్రసవాలు జరుగుతాయి. అందులో గతంలో పది వరకు సిజేరియన్ చేసేవాళ్లం. కానీ ఇటీవల కాలంలో వాటిని కూడా ఇంకా తగ్గించాం. ప్రస్తుతం 4 నుంచి 6 వరకు మాత్రమే సిజేరియన్ అవుతున్నాయి. అది కూడా చివరి నిమిషంలో వచ్చిన వారికి, బీపీ, వాతం ఎక్కువగా ఉన్న వారికి, రక్తహీనతతో బాధపడే వారికి సిజేరియన్ చేయాల్సి వస్తోంది. మిగిలిన సమయంలో సాధారణ ప్రసవానికే ప్రాధాన్యత ఇస్తాం. సాధ్యం కాకపోతేనే సిజేరియన్‌కు వెళ్తున్నాం.

– డాక్టర్ పి.స్నేహ, అసిస్టెంట్ ప్రొఫెసర్, గైనకాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



పేర్లు నమోదు చేసుకుంటున్న గర్భిణులు

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, కోసిగి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో గర్భిణులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 406 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఫాతిమ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అధిక ప్రాధాన్యత



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

కర్నూలు(అర్బన్): నాయీ బ్రాహ్మణులకు జగనన్న ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ ఏ.మధుసూదన్, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం నగర శివారులోని రాయలసీమ విశ్వ విద్యాలయం సమీపంలో నిర్మించిన నాయీ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ (నోపా) భవన ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు, తమ సామాజికవర్గ విద్యార్థుల కోసం వసతి గృహం నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. భవనాన్ని సద్వినియోగం చేసుకుని నాయీ బ్రాహ్మణ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు ప్రతి సెలూన్‌కు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తోందన్నారు. జగనన్న తోడు కింద పేద నాయీ బ్రాహ్మణులకు రూ.10 వేలు అందిస్తున్నారన్నారు. నోపా అధ్యక్షులు డాక్టర్ నవీన్‌కుమార్, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు జమ్ముల జనార్దన్ మాట్లాడుతూ భవన నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అట్టహాసంగా నిర్వహించిన వనభోజన కార్యక్రమంలో నేతలు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి నోపా నేతలు, ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య, మాజీ ఎంపీ బుట్టా రేణుక, డీఎస్పీ మహబూబ్‌బాషా, సీఐ ఉపేంద్రబాబు, నోపా ఉపాధ్యక్షులు ధనవిజయుడు, ప్రధాన కార్యదర్శి పోలీసు వెంకటస్వామి, కోశాధికారి అనుగొండ మద్దిలేటి, నాయకులు రామాంజనేయులు, మల్లికార్జున, వెంకటేష్, పసుపుల మధు, రాఘవేంద్ర, పుల్లయ్య పాల్గొన్నారు.

12 నుంచి ఉమ్మడి జిల్లాలో సెంట్రల్ టీం పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): కరువు ప్రాంతాల్లో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్(ఐఎంసీటీ) ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో పర్యటించి కరువు తీవ్రతను పరిశీలించనుంది. సెంట్రల్ టీమ్ పర్యటన ఖరారు కావడంతో జిల్లా యంత్రాంగం ఏఏ మండలాల్లో దెబ్బతిన్న పంటలను చూపించాలనే విషయమై ఖరారు చేసింది. కర్నూలు జిల్లాలో తుగ్గలి, కర్నూలు రూరల్ మండలాలు మినహా మిగిలిన 24 మండలాలు, నంద్యాల జిల్లాలో ఆరు మండలాలను ప్రభుత్వం కరువు ప్రాంతాలుగా గుర్తించింది. కరువు ప్రాంతాల్లో పర్యటించే సెంట్రల్ టీంకు కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ, ఫార్మర్ వెల్ఫేర్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పంకజ్‌యాదవ్ నేతృత్వం వహిస్తున్నారు. 10 మందితో కూడిన సెంట్రల్ టీం రాష్ట్రానికి వస్తోంది.

- ఈ నెల 11న సెంట్రల్ టీం అనంతపురం చేరుకుంటుంది.
- 12వ తేదీ మధ్యాహ్నం సమయానికి కర్నూలు జిల్లా పత్తికొండకు చేరుకుంటుంది.
- పత్తికొండ, ఆస్పరి, ఆదోని మండలాల్లో ఐఎంసీటీ పర్యటిస్తుంది. రాత్రికి ఆదోనిలో బస చేస్తారు.
- 13న ఆదోని, ఆలూరు, దేవనకొండ, కోడుమూరు, గూడూరు మండలాల్లో కరువు తీవ్రతను పరిశీలించడంతో పాటు రైతులతో ముఖాముఖి అవుతారు.
- సాయంత్రానికి కర్నూలు చేరుకొని కలెక్టరేట్‌లో కరువుపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తారు. అనంతరం కలెక్టర్‌తో సమావేశమవుతారు.
- 14న నంద్యాల జిల్లాలో పర్యటిస్తారు. వర్షాభావం వల్ల వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితి ఎలా ఉంది.. పశువులకు నీరు, మేత సమస్యలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వాటర్ సప్లై, భూగర్భ జలాల పరిస్థితి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తదితరాలను పరిశీలిస్తారని జిల్లా అధికారులు స్పష్టం చేశారు.

దేవుడిలా ఆదుకున్నారు





మాకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్ద కూతురు రజిని పెళ్లి చేసి పంపాం. చిన్నకూతురు శ్రావణి వికలాంగురాలు. మాకున్న ఆరెకరాల పొలంలో పంటలు పండకపోవడం, అప్పులు పెరగడంతో నా భర్త శ్రీరాములు 2017లో పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త పోయాడన్న బాధ ఓవైపు, మరో వైపు పిల్లలు, కుటుంబ పోషణ.. నాకు దిక్కు తోచలేదు. అప్పటి టీడీపీ ప్రభుత్వం నుంచి సాయం వస్తుందనుకున్నా నిరాశే ఎదురైంది. కష్టాలతో రోజూ కన్నీళ్లొచ్చేవి. చేసేదిలేక తొమ్మిదో తరగతి చదువుతున్న ధనుంజయను బడి మాన్పించి బోరు బండికి పనికి పంపించా. నేను రోజూ మిరప కోతలకు వెళ్లి కుటుంబాన్ని పోషించా. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా కష్టాలు తీరాయి. నా భర్త మృతి పరిహారంగా రూ.5లక్షలు ఇచ్చారు. వితంతు పింఛన్ కూడా మంజూరు చేశారు. ఏటా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందుతోంది. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 చొప్పున మూడేళ్ల పాటు రూ.56,250 అందింది. ప్రభుత్వ సాయం రాకుంటే పొలం అమ్మాల్సి వచ్చేది. సీఎం జగన్ మమ్మల్ని దేవుడిలా ఆదుకున్నారు. సొంత పొలం వ్యవసాయం చేసుకుంటూ ఉన్నంతలో బాగా బతుకుతున్నాం.

– వడ్డే ఆదిలక్ష్మి, చిన్న జొన్నగిరి, తుగ్గలి మండలం

సొంతింటి కల సాకారమైంది



టీడీపీ హయాంలో ఎన్నో సార్లు సొంతిల్లు కావాలని అధికారులు, నాయకులను అభ్యర్థించాం. ఆఫీసుల చుట్టూ తిరిగి అర్జీలు ఇచ్చాం. అయినా మా కల నెరవేరలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చాక మాకు ఎవరి సిఫార్సులు లేకుండా జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు కూడా మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటి వరకు రూ.1.64 లక్షలు అందించారు. సీఎం జగనన్న చలవతో సొంతింటి కల సాకారమైంది. కొత్తింటిలో హాయిగా జీవిస్తున్నాం. మా ఇద్దరు పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. వారికి అమ్మ ఒడి పథకం వర్తిస్తోంది.

– వి.గిరిజ, నందవరం

లోక్ అదాలత్‌లో 1,534 కేసులు పరిష్కారం

కర్నూలు (లీగల్): జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,534 కేసులు పరిష్కారం చేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్‌వీఎస్ శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులో జరిగిన లోక్ అదాలత్‌లో 69 రోడ్డు ప్రమాద కేసులను జిల్లా 6వ అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డి పరిష్కారం చేశారు. భూపరిహార కేసులను ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లీశ్వరి, మున్సిఫ్ కోర్టు ఆవరణలో టి.జ్యోత్స్నదేవి, కళ్యాణిలు కేసులను పరిష్కారం చేశారు. కర్నూలులో 563 కేసులు, ఆదోనిలో 119 కేసులు, ఆళ్లగడ్డలో 91, ఆలూరులో 251, ఆత్మకూరులో 93, బనగానపల్లెలో 50, డోన్‌లో 134, కోయిలకుంట్లలో 43, నందికొట్కూరులో 98, నంద్యాలలో 224, పత్తికొండలో 107, ఎమ్మిగనూరులో 118 కేసులు పరిష్కారం చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడి మృతి


నానేపాటి(ఫైల్)

ఆలూరు రూరల్: మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు నానేపాటి (105) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. వ్యవసాయం చేసి జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య నాగమ్మ, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగమ్మకు వందేళ్లు. నానేపాటి వందేళ్లకు పైగా జీవించడం ఆయన అదృష్టమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆయన మృతదేహాన్ని గ్రామస్తులు చివరి చూపు చూసి వచ్చారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు దుర్మరణం


లక్ష్మీనారాయణరెడ్డి (ఫైల్)

చాగలమర్రి: చింతలచెరువు గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణరెడ్డి (47) ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో దుర్మరణం చెందాడు. చాగలమర్రి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చింతలచెరువు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి శనివారం తెల్లవారుజామున ట్రాక్టర్ తీసుకోని పొలంలో సేద్యం పనులకు బయల్దేరాడు. మార్గ మధ్యలో రోడ్డుపై రైతులు ధాన్యం ఆరబోసి ఉండటంతో పక్కనుంచి వెళ్లేందుకు ప్రయత్నించటంతో ట్రాక్టరు ప్రమాదవ శాత్తూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రైతుపై ట్రాక్టరు ఇంజన్ పడటంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలంలో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

మద్యం అతిగా తాగి వ్యక్తి మృతి

కర్నూలు: ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన సతీష్ కుమార్ (46) కర్నూలు బాలాజీ లాడ్జిలో మద్యం అతిగా తాగి మృతిచెందాడు. ఈయన భార్య పద్మావతి నందవరం మండలం ధర్మపురం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. వీరికి కొడుకు, కూతురు సంతానం. సతీష్‌కుమార్ గత నెల 28న ఇంటి నుంచి కర్నూలుకు వచ్చాడు. 8వ తేదీ ఉదయం బాలాజీ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. మద్యం ఎక్కువగా తాగి గదిలో నుంచి బయటకు రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులకు అనుమానం వచ్చి తలుపులు తెరిచి చూడగా మంచంపై మృతిచెంది పడి ఉన్నాడు. రెండవ పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం కేసులో ఇద్దరు అరెస్టు

కర్నూలు: కర్ణాటక నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో నాల్గవ పట్టణ పోలీసులు కాపు కాసి ఇద్దరిని అరెస్టు చేశారు. గద్వాల జిల్లా ఉద్దేండపాలంకు చెందిన లక్ష్మీరెడ్డి, బండిఆత్మకూరు మండలం ఈర్నపాడుకు చెందిన వెంకటరమణ గౌడులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 100 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు సీఐ శంకరయ్య తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విధితో పోరాటం

- యువకుడికి రెండు కిడ్నీలు ఫెయిల్
- తల్లి కిడ్నీ దానంతో కోలుకున్న వైనం
- ఏడేళ్లకే ఆ కిడ్నీ కూడా ఫెయిల్యూర్
- డయాలసిస్‌తో ప్రాణాలు కాపాడుకుంటున్న యువకుడు
- దాతల ఆపన్నహస్తం కోసం నిరీక్షణ

సాక్షి, నంద్యాల: విధిరాతకు ఎవరూ అతీతులు కాదు. కానీ ఓ కుటుంబం ఏడేళ్లుగా విధితో పోరాటం చేస్తోంది. అనారోగ్యంతో మంచానికి పరిమితమైన యువకుడిని కాపాడేందుకు దాతల సహాయం కోసం ఎదురు చూస్తోంది. నంద్యాల జిల్లా మహానంది మండలం గోపవరం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తొట్టింపూడి పుల్లయ్య, వెంకటలక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో పెద్దకుమారుడు శివ అనిల్ కుమార్ ఎంబీఏ చదివి ప్రైవేటు ఉద్యోగం చేసేవాడు. తాను ప్రేమించిన ప్రసన్నను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ సంతోషం వారికి కొన్నాళ్లే నిలిచింది. 2016లో శివ అనిల్ కుమార్ అనారోగ్యానికి గురికాగా వైద్యులను సంప్రదిస్తే రెండు కిడ్నీలు పాడయ్యాయని గుండెలవిసే వార్త చెప్పారు. అయితే తల్లి పేగు బంధం కుమారుడిని కాపాడుకోవాలన్న తపనతో తల్లి వెంకటలక్ష్మమ్మ కిడ్నీ దానం చేసి ఊపిరి పోసింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం కావడంతో దాతలు ఇచ్చిన ఆర్థిక సహాయంతో 2016లో తల్లి ఇచ్చిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించారు. అయితే ఏడేళ్లలోనే తల్లి ఇచ్చిన కిడ్నీ కూడా పాడైపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. శివ అనిల్‌కుమార్ ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో మరోమారు విధిపై పోరాడి గెలవాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు.


శివఅనిల్‌కుమార్‌కు సపర్యలు చేస్తున్న భార్య ప్రసన్న

ఆర్థిక సహాయం చేసేందుకు..
బ్యాంక్ అకౌంట్: 32087715591, ఎస్‌బీఐ, శ్రీనివాసనగర్ బ్రాంచ్, నంద్యాల
ఫోన్‌పే నెంబర్ : 9393619494

వైద్య ఖర్చులకు ప్రభుత్వం భరోసా

వారంలో మూడుసార్లు డయాలసిస్ చేయించుకోవాలని శివఅనిల్‌కుమార్‌కు వైద్యులు సూచించారు. వారంలో ప్రతి మంగళవారం, శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఉదయానంద ఆసుపత్రిలో వైద్యుల సూచనల మేరకు డయాలసిస్ చేయిస్తున్నారు. మూడోసారి డయాలసిస్ చేయించడానికి శరీరం సహకరించడం లేదని కుటుంబీకులు చెబుతున్నారు. గతంలో డయాలసిస్ చేయించుకోవడానికి ఎన్నో పాట్లు పడే వాళ్లమని, కానీ నేడు ఉచితంగా జగనన్న ప్రభుత్వం అందించడమే కాకుండా పెన్షన్ రూ.10వేల ఆర్థిక సాయం ప్రతి నెల అందిస్తున్నారని చెబుతున్నారు. డయాలసిస్ సందర్భంలో ఒక్కోసారి బ్లడ్‌ప్రెజర్ పడిపోతుందని, గతం కంటే అధికంగా నీరసం వస్తుందని చాలా ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. మరోమారు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఆర్థిక సహాయాన్ని అందజేసి పునర్జన్మ ప్రసాదించాలని తల్లి వెంకటలక్ష్మమ్మ, భార్య ప్రసన్న వేడుకుంటున్నారు.


డయాలసిస్ చేయించుకుంటున్న దృశ్యం

దాతల్లారా దీవించండి



ఏడేళ్ల క్రితం నా కుమారుడు శివఅనిల్‌కుమార్‌కు కిడ్నీలు చెడిపోవడంతో నేను ఒక కిడ్నీకి దానం చేశాను. అయితే దురదృష్టవశాత్తు ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో దానం చేసిన కిడ్నీ కూడా ఫెయిల్ అయినట్లు వైద్యులు తెలిపారు. కిడ్నీ మార్చేందుకు సుమారు రూ.15 నుంచి రూ.18లక్షల దాకా ఖర్చు వస్తుంది. దాతలు మానవతా దృక్పథంతో స్పందించి నా కుమారుడి కిడ్నీ మార్పు చేసేందుకు సహాయం చేయాలని వేడుకుంటున్నాను.

– వెంకటలక్ష్మమ్మ, బాధితుడి తల్లి

పరిస్థితి క్షీణిస్తుంది

నా భర్త శివ అనిల్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని భయమేస్తుంది. నా భర్త ప్రాణాల కంటే నాకు ఎక్కువ ఏమీ లేదనే విషయానికి వచ్చి నేను స్వయంగా కిడ్నీ దానం చేసేందుకు సిద్ధమయ్యాను. కిడ్నీ ఇవ్వాలనుకున్నా తిరిగి డబ్బు ఖర్చు అవుతుండటంతో ఉన్నదంతా ఖర్చు చేసినా తమకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. దాతలు, ప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందించి నిండుప్రాణాన్ని కాపాడి న్యాయం చేయాలని వేడుకుంటున్నాను.

– ప్రసన్న, కిడ్నీ బాధితుడి భార్య

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన


దేవతా మూర్తులకు మహా రాజభోగ నివేదన

కర్నూలు కల్చరల్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగింది. జగన్నాథ, బలభద్ర, సుభద్రా మయి, సుదర్శన విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టాపన చేశారు. దేవతా మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. మహారాజ భోగను నివేదించారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునంద సేవక్ ప్రభు, ఇస్కాన్ సభ్యులు పాల్గొన్నారు.

13న మిర్చి మార్కెట్ ప్రారంభం

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈనెల 13న మిర్చి మార్కెట్ ప్రారంభమవుతుందని కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, సభ్యులు రాజాగౌడ్ తెలిపారు. శనివారం మిర్చి 'మార్కెట్ ప్రారంభమయ్యేనా' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి స్పందించారు. కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ప్రతినిధులను సంప్రదించి కచ్చితంగా బుధవారం యార్డును ప్రారంభించాలని తెలియజేశారు. ఆ మేరకు యార్డులోని పత్తి టీఎంసీ వెనక భాగంలో ఉన్న గోదాము వద్ద ఉదయం 10 గంటలకు మార్కెట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్ పాల్గొంటారన్నారు. ఆదోని యార్డులోనే మిర్చి మార్కెట్ ప్రారంభమవుతుందని, దూర ప్రాంతాలకు వెళ్లి వృథా ఖర్చులు చేసుకోకుండా రైతులు ఇక్కడే క్రయ, విక్రయాలు చేపట్టాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు: స్థానిక అమీలియో హాస్పిటల్ వెనుక ఉన్న శిల్పానందవనం అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఫ్లాట్ నెం.218లో నివాసముంటున్న విజయ్‌కుమార్ దంపతులు శనివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌తో పాటు టీవీ, ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులు, దుస్తులు కాలిపోయాయి. విజయ్‌కుమార్ దంపతులు ఇంటికి వచ్చేసరికి హాల్‌లో సామగ్రి అంతా కాలి బూడిదయ్యింది. దాదాపు రూ.2 లక్షల విలువ చేసే సామగ్రి కాలిపోయిందని విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ఆర్గానిక్ సర్టిఫికెట్స్

కర్నూలు(అగ్రికల్చర్): పెట్టుబడి లేని వ్యవసాయం చేస్తున్న రైతులతో గ్రూపులు ఏర్పాటు చేసి పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికెట్స్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. కర్నూలులోని మెక్లిన్ ట్రైనింగ్ సెంటర్ కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఆర్గానిక్ సర్టిఫికెట్స్ పొందడంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర రైతుసాధికార సంస్థ ప్రతినిధులు ప్రభాకర్, చక్రాల చంద్రశేఖర్‌లు పలు వివరాలు తెలియజేశారు. అనంతరం డీపీఎం మాట్లాడుతూ పొలంలో విత్తనం వేసింది మొదలు పంట చేతికి వచ్చే వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులనే పాటించాలని, రసాయనాలు ఎట్టి పరిస్థితుల్లో వాడరాదని సూచించారు. ఆరోగ్యవంతమైన పంటలు పండించిన రైతులకు పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికెట్ వస్తుందని తెలిపారు. పీజీఎస్ ఇండియా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న రైతులకు మొదటి రెండు సంవత్సరాలకు ఆర్గానిక్ గ్రీన్ సర్టిఫికెట్, మూడవ సంవత్సరానికి ఆర్గానిక్ సర్టిఫికెట్ అందజేస్తారన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్లు రాజేశ్వర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీపీఎం చంద్రశేఖర్

వైద్యులకు బయోమెట్రిక్ తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): మెడికల్ కాలేజీల్లో పనిచేసే వైద్యులు, చదువుకుంటున్న వైద్య విద్యార్థులకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి అన్నారు. శనివారం ఆమె కర్నూలు మెడికల్ కాలేజీలోని లెక్చర్ గ్యాలరీలో వైద్యులు, విద్యార్థులతో మాట్లాడారు. ఫేస్ రికగ్నేషన్ యాప్‌తో పాటు బయోమెట్రిక్ ద్వారా సైతం హాజరు వేయాలని సూచించారు. మైలాఫ్ట్ యాప్‌లోని జర్నల్స్, పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కళాశాలలోని ఎగ్జామ్ హాలు, లైబ్రరీని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమెను అధికారులు, వైద్యులు సన్మానించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ చిట్టినర్సమ్మ, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు ఉన్నారు.


రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు





పాతాళగంగలో పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు, భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు


కార్తీకదీపారాధన నిర్వహించుకుంటున్న మహిళ

శ్రీశైలంటెంపుల్: కార్తీకమాసోత్సవాన్ని పురస్కరించుకుని వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకున్నారు. కార్తీకమాసం చివరివారం కావడంతో శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులు దీరారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్ద ఆలయ ఉత్తరమాడ వీధిలో కార్తీకదీపారాధన చేసుకుని ప్రత్యేక నోములు నోచుకున్నారు. అనంతరం ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర క్యూల ద్వారా ఆలయంలోకి ప్రవేశించి మల్లికార్జున స్వామివారిని, శ్రీభ్రమరాంబా దేవిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లన్నీ నిండిపోయాయి. ఉచిత దర్శనానికి నాలుగు గంటల సమయం, అతిశీఘ్రదర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం శోభిల్లుతుంది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కళకళలాడాయి. ఆలయ క్యూలైన్లలో ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ క్యూలలోని భక్తులకు నిరంతరం తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు, అందజేశారు. భక్తులందరికీ స్వామివారి సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు గాను అలంకార దర్శనాన్ని మాత్రమే కల్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- విద్యార్థి కుటుంబానికి రూ. లక్ష సాయం

కొలిమిగుండ్ల: శ్రీశైలం డ్యామ్‌కు చెందిన బీసీ బాలుర గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం బెలుం గుహల ఆవరణలో నిర్వహించారు. 1990 నుంచి 2023 బ్యాచ్‌లకు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒకేవేదికపై కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కొలిమిగుండ్లకు చెందిన కౌశిక్‌కుమార్ అదే పాఠశాలలో చదువుకుంటూ ఏడేళ్ల కిందట మృతి చెందిన నేపథ్యంలో పూర్వ విద్యార్థిలు బాధిత కుటుంబానికి రూ. లక్షతోపాటు కుట్టుమిషన్‌ను అందజేశారు.


మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి చెక్కు అందిస్తున్న దృశ్యం

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు


మూలసాగరంలో ఆటో గ్యారేజీలో బాల కార్మికుడితో మాట్లాడుతున్న డీఈఓ

నంద్యాల(న్యూటౌన్): బడిఈడు బాలలను పనుల్లో పెట్టుకుంటే యజమానులపై చట్టరీత్యా చర్యలు తప్పవని డీఈఓ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం స్పెషల్ డ్రైవర్ కార్యక్రమంలో భాగంగా కార్మిక , విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని పలు మెకానిక్ షాపులు, బేకరీలు, ఐరన్, షీట్‌కవర్ షాపుల్లో పనుల్లో చేస్తున్న పలువురు చిన్నారులను గుర్తించారు. బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని షాపు యజమానులకు సూచించారు. పిల్లలను బడులకు పంపేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ బరుషిరున్నీసా బేగం, ఎంఈఓ బ్రహ్మంనాయక్, సీఆర్పీలు పాల్గొన్నారు.